



చేగుంట ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంటలో నిర్వహించిన రోడ్డు షోకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

# రఘునందన్‌రావు నయా పైసా పనిచేయలే..

- మాయమాటలకు మోసపోయి గోస పడొద్దు
- కేసీఆర్ చేతిలోనే రాష్ట్రం సురక్షితం
- కోటి కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత కేసీఆర్ బీమా
- ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే చేగుంటకు డిగ్రీ కళాశాల, స్టేడియం రైల్వే బ్రిడ్జి తెస్తాం
- డబ్బులకు ఆశపడి ఓటు అమ్ముకుంటే అభివృద్ధికి దూరమే..
- గృహలక్ష్మి పథకంలో ఇండ్లు లేని వారికి ఇండ్లు మంజూరు చేస్తాం
- ప్రభాకరన్నను గెలిపించుకుంటేనే చేగుంట అభివృద్ధి
- చేగుంట రోడ్ షోలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

చేగుంట, నవంబర్ 28: అబద్ధాలు, మాయమాటలు చెప్పి గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు పైసా పని చేయలేదని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ చెప్పే 3 గంటల కరెంటుతో ఎవుసం నడవదని, మాయమాటలకు మోసపోయి ఓటు వేస్తే గోస పడే అవకాశం ఉన్నదన్నారు. ప్రభాకరన్నను గెలిపించుకుంటేనే చేగుంట అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. చేగుంట మండలం వడియారం గ్రామం నుంచి చేగుంట గాంధీ చౌరస్తా వరకు దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి రోడ్డుషోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేగుంటకు డిగ్రీ కళాశాల, స్టేడియం రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. డబ్బులకు ఆశపడి ఓటును అమ్ముకుంటే అభివృద్ధికి దూరమయ్యే అవకాశం ఉన్నదన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకంలో ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. చేగుంట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, తన దృష్టికి వచ్చిందని, ఎన్నికల కోడ్ పోగానే మిగిలిన రైతులకు మాఫీ జరుగుతుందన్నారు.

### 3 గంటల కరెంటుతో ఎవుసం సాగుతుందా?

కాంగ్రెస్ చెప్పే 3 గంటల కరెంటుతో ఎవుసం సాగుతుందా అని మంత్రి ప్రశించారు. మాయమాటలు చెప్పే పార్టీలను నమ్ముకుంటే మోసపోయి గోస పడాల్సి వస్తుందన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై కత్తి పోటు జరిగిందని, దేవుడి దయతో బతికి మీ ముందు కొచ్చిండని అన్నారు. కష్టంలో ఉన్నా దయగుణం గల మంచి ప్రభాకరన్న కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని మంత్రి తెలిపారు. గృహలక్ష్మి పథకంలో ఇల్లులేని వారికి డబ్బులు కూడా ఇప్పిస్తామన్నారు. చేగుంటలో రైల్వే బ్రిడ్జి కట్టుకోవాలని, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, స్టేడియం, గ్రామగ్రామాన మహిళా భవనాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాంగ్రెసోళ్లు బీడికట్టలపై పుర్రె గుర్తు తెస్తే, బీజేపోళ్లు జీఎస్టీతో పాటు గ్యాస్ ధర విపరీతంగా పెంచారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు,ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు పెన్షన్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. సౌభాగ్యలక్ష్మి పథకంతో నిరుద్యోగ మహిళలకు రూ.3000తోపాటు, రేషన్ కార్డుతో సన్న బియ్యం అందజేస్తారన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు, ప్రాజెక్టులతో సాగునీరుతోపాటు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టులోని పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రేపు జరిగే ఎన్నికల్లో దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు.



చేగుంట ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

### చేగుంటను అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించాలి

**- బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి**

మీ అందరి దీవెనలతో మళ్లీ మీ ముందుకొచ్చా. మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్ సహకారంతో దుబ్బాకను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం వడియారం నుంచి చేగుంట వరకు బీఆర్ఎస్ రోడ్‌షో నిర్వహించారు. చేగుంట హెలిప్యాడ్ వద్ద మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డికి ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆలయ ధర్మకర్త కిషన్‌రావు దేశ్‌ముఖ్ ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని చేగుంటలోని యూత్ సభ్యులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలకు అనేక సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతు బంధును నిలిపేసారన్నారు. రెడ్డిపల్లి, వడియారం, చేగుంటను అన్నిరకాల అభివృద్ధి చేస్తాన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, వడ్డెపల్లి తిరుమల నర్సింహులు, బక్కి లక్ష్మీరమేశ్, అయిత వెంకటలక్ష్మి రఘురాములు, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, నాయిని రాజ్‌గోపాల్, సుభాష్ రెడ్డి, క్రాంతి, సాబీర్‌ఆలీ, కిషన్‌రావు, ఎర్ర యాదగిరి, బుడ్డ భాగ్యరాజ్, కారింగుల సిద్దిరెడ్డి, కొటారి అశోక్, సత్యనారాయణ లక్ష్మణ్, రామారావు, నర్సింహులు, రవి ఉన్నారు.

---

# సబ్బండ వర్గాలు సతీషన్న వెంటే..

- హుస్నాబాద్ నియోజకవర్గంలో మారిన రాజకీయ సమీకరణలు
- గులాబీ జెండా వైపే గ్రామీణ ప్రాంతాల ప్రజలు
- నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజల మదిలో బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 28: హుస్నాబాద్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు రోజురోజుకూ మారిపోతున్నాయి. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రజలకు గులాబీ జెండా మరింత దగ్గరవుతోందని, సబ్బండ వర్గాలు బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ వెంటే ఉండేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఎనకట ఎవరో సామెత చెప్పినట్లు 'కొత్తది గొర్ల మడుగు... పాతది బర్ల మడుగు..' అన్న చందంగా నియోజక వర్గానికి కొత్తగా వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి గురించి చర్చించుకోవడం మొదలు పెట్టారు. ఆ పార్టీ ప్రచారంలో లోపమో, నాయకత్వ లోపమో గానీ ప్రజలు ఆ పార్టీ గురించి గానీ, ఆ పార్టీ అభ్యర్థి గురించి గానీ చర్చించేందుకు అంతగా ఇష్టపడటం లేదనేది ప్రస్తుత పరిస్థితులను బట్టి తెలుస్తోంది. ప్రారంభంలో సదరు అభ్యర్థికి జనం నీరాజనం పలికినప్పటికీ, ప్రస్తుతం జనం నుంచి స్పందన లేదనేది విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు గులాబీ జెండాయే తమ ఎజెండా అంటూ ముందుకొస్తున్నారు. పదేండ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా, కుల మతాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన సతీశ్‌కుమార్ వెంటే తాముంటామని 161గ్రామాల్లోని అన్ని కుల సంఘాలు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే పలు కుల సంఘాల పెద్దలు, ఆయా సంఘాల సభ్యులు సతీశ్‌కుమార్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలతో కూడిన హుస్నాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ వచ్చాక రెండుసార్లు ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో సతీశ్‌కుమార్ విజయం సాధించారు. మూడోసారి కూడా ఆయనే విజయం సాధించాలని ఆయా మండలాల ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు సమాచారం.

### ఇస్తున్నోళ్లకే ఓటేస్తం...

'తొమ్మిదిన్నరేండ్లుగా ఇస్తున్నోళ్లకు ఓట్లేస్తం గానీ...ఇస్తామని చెప్పి మోసం చేసేటోళ్లకు ఓట్లేస్తమా...'అని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు తామే చర్చించుకుంటున్నట్లు తెలిసింది. 'ఇస్తామనెటోడు ఇచ్చేది ఎట్ల నమ్ముతం...ఇప్పటికే ఇస్తున్నోళ్లను నమ్ముతం...' అంటూ ఎదుటి పార్టీ నాయకుల ముఖంపైనే చెప్తున్నారు. ఆపద ఉన్నదంటే చేతి నుంచి డబ్బులిచ్చి ఆదుకునే ఆపద్బాంధవుడు, అవినీతి రహిత, నిస్వార్థంగా ప్రజా సేవ చేసే నాయకుడు, నిరంతరం ప్రజల గురించే ఆలోచించే ప్రజా బాంధవుడు సతీశ్‌కుమార్‌నే మూడోసారి గెలిపించాలని నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు ఆలోచిస్తున్నారు. పదేండ్ల పాటు మా సాదకబాదకాలు చూసినోడు...అభివృద్ధి చేసినోడికి ఓటేస్తం తప్ప ఎక్కడి నుంచో వచ్చి ఏదో చేస్తమనేటోళ్లకు ఎట్లా ఓటేస్తమని టాక్ వినిపిస్తున్నది. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా రూ.5వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు, రూ.4వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన సతీశ్‌కుమార్‌కే తమ సంపూర్ణ మద్దతు అని సబ్బండ వర్గాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఏదేమైనా బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ అన్ని వర్గాల మద్దతులో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు.



శనిగరం గ్రామ ఎన్నికల ప్రచారంలో జై తెలంగాణ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్